క్లుప్తంగా

బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

దేవరకొండ : అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని బంజార సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేతావత్ లక్ష్మానాయక్, కొర్ర శంకర్ నాయక్‌లు కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లంబాడీ సామాజిక వర్గానికి చెందిన బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా గిరిజనులకు న్యాయం చేసినట్లవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాలునాయక్‌కు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సేవాలాల్ మహారాజ్ దేవాలయ కమిటి ప్రధాన కార్యదర్శి కేతావత్ పంతులాల్, రమావత్ ధరమ్‌సింగ్, గోపాల్‌సింగ్, బిక్కునాయక్, తుల్చానాయక్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో సామగ్రి భద్రం

మిర్యాలగూడ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం సమకూర్చిన సామగ్రి భద్రంగానే ఉందని, ఆర్‌అండ్‌బీ డీఈ గణేశ్‌కుమార్ తెలిపారు. సామగ్రి అక్రమంగా తరలించారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ప్రభుత్వం నుంచి 2018లో కేటాయించిన రూ.1కోటి నిధులకు అదనంగా అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు రూ.20లక్షల వ్యయంతో అదనపు నిర్మాణాలు చేశారన్నారు. ప్రజలు కూర్చొనేందుకు ప్రత్యేకంగా షెడ్, లిఫ్ట్ ఏర్పాటు చేశారన్నారు. ఖాళీ చేసే సమయంలో లిఫ్ట్ కూడా ఉంచి వెళ్లారన్నారు. సమకూర్చిన సామగ్రి భవనంలోనే ఉందన్నారు.

బియ్యం, చీరల పంపిణీ



బియ్యం, చీరలు పంపిణీ చేస్తున్న వాసవి, వనితాక్లబ్ నిర్వాహకులు

మిర్యాలగూడ టౌన్ : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్ ఐత రాములు, ప్రవాస భారతీయుడు గంధం కిరణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పేదలకు బియ్యం, ఆర్టీసీ కార్మికులకు క్లబ్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. అనంతరం ప్రయాణికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషన్ రీజియన్ చైర్‌పర్సన్ రాయపూడి భవాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ సంధ్యారాణి, వాసవి, వనితా క్లబ్ సభ్యులు తిరునగరు పద్మావతి, గంధం శ్రీనివాస్, లీలారాణి, కుండా సంతోష్‌కుమార్, మాలతి, అల్లాని రాంబాబు, సునిత, గుండా లక్ష్మి తదితరులున్నారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా అన్వరుద్దీన్



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

హాలియా : ఐఎన్‌టీయూసీ సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా హాలియా పట్టణానికి చెందిన షేక్ అన్వరుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య ఆధ్వర్యంలో మంగళవారం సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి నియామకపత్రాన్ని అన్వరుద్దీన్‌కు అందజేశారు. తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి జానారెడ్డి, ఐఎన్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘువీర్‌రెడ్డి, లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మైనోద్దీన్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సాజిద్, మైనార్టీ నాయకులు షకీల్ బాబా, శర్ఫుద్దీన్, అబ్దుల్ బిన్, సోహెల్, పాషా తదితరులు పాల్గొన్నారు.

ధీరజ్ ప్రసాద్ సాహు దిష్టిబొమ్మ దహనం

మిర్యాలగూడ టౌన్ : ఒడిషా రాష్ట్రంలోని రాంచీలో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు ధీరజ్ ప్రసాద్ సాహు నివాసంలో జరిగిన ఐటీ అధికారుల దాడుల్లో అవినీత డబ్బు నిల్వలను నిరసిస్తూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో సాహు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాదినేని శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్యాం, గిరి, సీతారాంరెడ్డి, రామచంద్రారెడ్డి, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, రాజీరెడ్డి, వేణు, రమణ, మైనార్టీ నాయకులు భాష, పెదమాం భరత్, సైదులు, అశోక్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా చలిచీమలపాలెం రోడ్డు

- వర్షాకాలంలో నడవలేకపోతున్న ప్రజలు
- బీటీ కోసం రూ.40లక్షల నిధులు మంజూరు
- ఇంకా పూర్తికాని టెండర్ ప్రక్రియ
- త్వరగా రోడ్డు పనులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



బురదమయంగా ఉన్న రహదారి

వేములపల్లి : మండలంలో నూతనంగా ఏర్పడిన లక్ష్మీదేవిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చలిచీమలపాలెం గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇరు గ్రామాల మధ్య దూరం సుమారు 2కిలో మీటర్లు ఉండగా కొన్నేళ్ల కిందట పంట పొలాలకు సమీపంలో సుమారు 40 కుటుంబాల వారు ఆవాసమేర్పరుచుకొని నివాసం ఉంటున్నారు. ఐదేళ్ల కిందట వరక లక్ష్మీదేవిగూడెం గ్రామం ఆమనగల్లు గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది. ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. కాగా ఈ గ్రామ పరిధిలో గల చలిచీమలపాలెంకు నేటి వరకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరైనా..

మూడు నెలల క్రితం లక్ష్మీదేవిగూడెం నుంచి చలిచీమలపాలెం వరకు సుమారు 2కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.40లక్షల నిధులు మంజూరు అయ్యాయి. టెండర్ల ఆలస్య కారణంగా ఇప్పటివరకు పనులు మొదలు కాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. చిన్న వర్షం పడిన ఈ రహదారి చిత్తడిగా మారి ఈ దారిలో నడవలేకపోతున్నారు.

వర్షాకాలంలో నడవలేని పరిస్థితి



వర్షాకాలం వచ్చిందంటే మా గ్రామస్తులు లక్ష్మీదేవిగూడెం– చలిచీమల పాలెం రోడ్డుపై నడవలేని పరిస్థితి ఉంటుంది. రోడ్డుపై గుంతలు గుంతలు ఉంటుంది. దీంతో ప్రయాణికులు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా అవసరం ఉండి వేరే గ్రామానికి వెళ్లాలంటే గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలి.

– పోరెడ్డి ఇంద్రారెడ్డి, లక్ష్మీదేవిగూడెం

నిత్యం పలు పనుల నిమిత్తం గ్రామానికి.. పట్టణానికి వెళ్లేందుకు బస్సు కోసం రావాలన్నా ఈ దారిలో నడిచే పరిస్థితి లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి తమ ఇక్కట్లను తొలగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమస్య అసెంబ్లీలో ప్రస్తావిస్తా

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్‌ఆర్



ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

మిర్యాలగూడ : రెండో ఏఎన్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ అన్నారు. మంగళవారం రెండో ఏఎన్‌ఎంలు పట్టణంలో ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రెండో ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి వెట్టి చాకిరి చేయించారన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారు కోరారు. రెండో ఏఎన్‌ఎంల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె.సరిత, నిర్మల, జ్యోతి, వనజాత, నాగలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు హామీని నిలబెట్టుకోవాలని జిల్లా సాధన సమితి నేతలు ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌ను కోరారు. మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా ఏర్పాటుపై ఎమ్మెల్యేతో ఆ సంఘం నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సాధన సమితి నేతలు మాలోతు దశరథనాయక్, జాడీ రాజు, మారం శ్రీనివాస్, రాపోలు పరమేష్‌లు మాట్లాడుతూ ప్రజా అభిప్రాయానికి అనుగుణంగా జిల్లా ఏర్పాటు కోసం తన వంతు కృషి చేస్తానని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో స్టీరింగ్ కమిటీ సభ్యులు బెజ్జం సాయి, మురళియాదవ్, జ్వాల వెంకటేశ్వర్లు, దుర్గయ్య, సుధాకర్, అంజయ్య, శ్రీనివాస్, మెసిస్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



మిర్యాలగూడ టౌన్: మాట్లాడుతున్న యూనియన్ నాయకులు



నిడమనూరు : సమ్మెలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

మిర్యాలగూడ టౌన్ : తపాలా గ్రామీణ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తపాలా గ్రామీణ ఉద్యోగుల సంఘాల కేంద్ర కమిటీల పిలుపు మేరకు మంగళవారం మిర్యాలగూడలోని గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. అనంతరం సమ్మెను ఉద్దేశించి ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ సీనియార్టీ ప్రకారం సర్వీస్ ఇంక్రిమెంట్ సమస్య వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు. బ్రాంచ్ ఆఫీసుల్లో 8గంటల పని విధానంతో పాటు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. గ్రూప్ ఇన్సురెన్స్‌ను రూ.5లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. జీడీఎస్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు వైద్యసదుపాయాన్ని కల్పించాలని, టార్గెట్ల పేరుతో చేపడుతున్న ఒత్తిడి తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు రవి, కరుణాకర్, బిక్షం, మర్రి చెన్నా, ఖరీం, వెంకట్‌రెడ్డి, సాయి, హన్మంతు తదితరులున్నారు.

నిడమనూరు : తమ న్యాయమైన డిమాండ్ల నేరవేర్చేవరకు సమ్మె చేస్తున్నట్లు ఆలిండియా గ్రామీణ తపాలా (డాక్ సేవక్) యూనియన్ నాయకులు మంగళవారం అన్నారు. యూనియన్ పిలుపు మేరకు మంగళవారం మండలకేంద్రంలో వారు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెలో తుమ్మల ప్రభాకర్, సందీప్, వెంకటయ్య, వెంకట రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామారావు, రమేష్, చిత్రం ప్రసాద్, బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థల్లో బీసీలకు 22శాతం నుంచి 42శాతానికి రిజర్వేషన్లను పెంచిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల్లో బీసీ 22నుంచి 42శాతానికి పెంచుతామని బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించారని గుర్తు చేసినట్లు తెలిపారు. రిజర్వేషన్లపై స్పష్టత లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, జంగిలి వెంకన్న యాదవ్, రాంబాబు యాదవ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



హాలియా : జైవీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్యవైశ్య సంఘం నేతలు



త్రిపురారం : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు



పెద్దవూర : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హాలియా : అన్ని వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హాలియా మున్సిపాలిటీ ఆరో వార్డు కౌన్సిలర్ గౌనీ సుధారాణిరాజా రమేష్ యాదవ్ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్క నిరుపేద కుటుంబాలకు అందే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, ఆరవ వార్డు మహిళలు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ఎమ్మెల్యేగా గెలుపొందిన జైవీర్‌రెడ్డిని అనుముల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు కాంగ్రెస్ హాలియా పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిప్రోలు యాదగిరి, సాయి మందిరం చైర్మన్ శేఖర్, అనుముల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, కొందూరు గణేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం

త్రిపురారం : కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీ బలం అని, వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యేగా జైవీర్‌రెడ్డి మండలంలో పర్యటించారు. దీంతో మండల కేంద్రంలోని ఎంపీపీ అనుముల పాండమ్మ నివాసంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం చేశారు. ఈ సందర ్భంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేసిన కార్యకర్తలకు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ ధనావత్ భారతీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, ఎంపీపీ గౌరవ సలహదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సోమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవి కుమార్, ఉప సర్పంచ్ పీబీ శ్రీనివాస్, ఎంపీటీసీలు రాము, యాదగిరి, అనుముల వెంకట్ రెడ్డి, నర్సి రెడ్డి, సాంబయ్య, హుస్సేన్, హనుమయ్య పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవూర : నియోజకవర్గ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని మంగళవారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, పద్మారెడ్డి, మురళీయాదవ్, ఆంజనేయులు, కిషన్, లక్ష్మయ్య, వెంకట్, సైదులు, లక్ష్మయ్య, అంజయ్య పాల్గొన్నారు.

జాతీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

చింతపల్లి : మండలరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో జైహో రెండో జాతీయ సమ్మేళనం పోస్టర్‌ను భారత రాష్ట్ర కార్యదర్శి రాజు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 19న నెల్లూరులో జరిగే జైహో రెండవ జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభకు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పవన్‌కుమార్, శ్రావణ్, గణేష్, శివ, శ్రీశైలం, అభిలాష్, రాణి, పార్వతమ్మ, జంగం పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



తిరుమలగిరి : ఆర్థికసాయం అందజేస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి



గుర్రంపోడు : ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు కరుణాకర్‌రావు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన పల్‌రెడ్డి బొబ్బిలిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి మంగళవారం కొంపల్లిలోని బొబ్బిలిరెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి పాండురంగారెడ్డి ఆర్థిక సాయం అందజేసి, మునుముందు కూడా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. అలాగే ఆదే గ్రామానికి చెందిన ఎరుకుల మౌనిక కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, వెంకన్న, వెంకటేశ్వర్లు, రాజయ్య, ముస్తఫా, పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండలంలోని నడికుడ గ్రామానికి చెందిన అనారోగ్య బాధిత కుటుంబాలను జిల్లా కాంగ్రెస్ నాయకుడు వెల్గపూరి కరుణాకర్ రావు మంగళవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కలకొండ యాదయ్యకు రూ.10 వేల ఆర్థిక సాయం, అయితరాజు సైదయ్యకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎండీ సత్తార్, ఎంపీటీసీ కలకొండ కల్యాణ్, మాజీ సర్పంచ్ అయితరాజు జానయ్య, నాయకులు వడ్డగోని యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటుకు కృషిచేయాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ : దేవరకొండ జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా లాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేస్తే దేవరకొండ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన పాలన అందుతుందన్నారు. చందంపేట మండలంలోని చిత్రియాల, డిండి మండల పరిధిలోని చెర్కుపల్లి, దేవరకొండ మండల పరిధిలోని పద్మట్‌పల్లి, చింతపల్లి మండలం గొడకొండ్ల గ్రామపంచాయితీలను సైతం మండలాలుగా ఏర్పాటు చేయాలని ఆయన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క వెంకటేష్‌యాదవ్,వనం పుష్పలత,వసుకల సుధాకర్, వనం జగదీశ్వర్, ఎర్ర వెంకటేశ్వర్లు, నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, పగిళ్ల సాగర్, పులిజాల ఆదిత్య, నాగిళ్ల ఆంజనేయులు, పోలగోని గణేశ్, తదితరులున్నారు.

మహిళా గురుకుల డిగ్రీ కళాశాలకు సర్టిఫికెట్ల ప్రదానం



ప్రిన్సిపాల్‌కు సర్టిఫికెట్లు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

దేవరకొండ : మండల పరిధిలోని తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు గ్రీన్ ఆడిట్ బృందం ఇంటర్నేషనల్ సంస్థ మూడు సర్టిఫికెట్లను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు. ఎన్విరామెన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ వ్యవస్థకు సంబంధించి రాష్ట్రంలోనే మొట్టమొదటగా కళాశాలకు సర్టిఫికెట్లను ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు. మంగళవారం కళాశాలను సందర్శించిన సంస్థ నిర్వాహకులు ఈ సర్టిఫికెట్లను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలకు ఒకే సారి మూడు సర్టిఫికెట్లు రావడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల నిరసన

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం అని ప్రకటించడంతో ఆటో కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆరోపిస్తూ ఆటో కార్మికుల మద్దతుగా మంగళవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్‌గౌడ్ సత్య.నారాయణ, రమేష్, శంకర్, సుభాష్, శ్రీను, శివ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీకి హాజరైన విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని హనుమాన్‌పేటలో లోటాస్ హైస్కూల్‌లో మంగళవారం అల్లం కిరణ్‌కుమార్ 16వ వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచణ పోటీలను అల్లం కిరణ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్త అల్లం కిరణ్‌కుమార్ 16వ వర్ధంతిని ఈనెల 13న లోటాస్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, రచయిత అల్లం రాజయ్య, తెలంగాణ మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, సమూహ రైటర్స్ ఫోరం నాయకులు కస్తూరి ప్రభాకర్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుదర్శన్, దశరధరెడ్డి, శ్రీనుతో ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడి వీధిలో ఉన్నా తొలగించేందుకు ఇష్టం లేక.!



అభంగాపురంలో నడి వీధిలో ఉన్న భారీ వేప చెట్టు

మాడుగులపల్లి : వీధుల్లో సీసీరోడ్డు వేసేటప్పుడు అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. చెట్లు, స్తంభాలు అడ్డువస్తే వాటిని తొలగిస్తారు. కానీ మండలంలోని అభంగాపురం గ్రామంలో ఇందుకు భిన్నంగా ఓ వీధి మధ్యలో భారీ వేప చెట్టు ఉన్నా అలాగే సీసీ రోడ్డు వేశారు. ఇందుకు ఓ బలమైన కారణం లేకపోలేదు. ఈ వేప చెట్టు 70ఏళ్ల నాటిది కావడం.. వీధిలోని వారందరికీ దీంతో ప్రత్యేక అనుబంధం ఉండడంతో తొలగించేందుకు అడ్డు చెప్పారు. తమకు గుర్తు తెలిసిన నాటి నుంచి వేసవిలో ఈ చెట్టు కిందే సేద తీరామని, నీడనిచ్చిన చెట్టును వదులుకోలేమని విన్నవించడంతో చేసేది లేక అలానే సీసీ వేశారు. ద్విచక్ర వాహనాలు తప్ప ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నేరుగా ఇళ్ల ముందుకు వచ్చేందుకు చెట్టు అడ్డుగా ఉన్నా స్థానికులు దీన్ని తొలగించేందుకు ఇష్ట పడకపోవడం పచ్చదనంపై వారికి ఉన్న మక్కువను తెలియజేస్తోంది.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈఓ భిక్షపతి అన్నారు. మంగళవారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలోని కస్తూరి బా గాంధీ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ తరి రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

34,316 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



ధాన్యాన్ని కాటా వేసి నింపుతున్న హమాలీలు



లారీలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న హమాలీలు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి, పెండ్లిపాకలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 588 మంది రైతుల నుంచి 34,316 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి ధాన్యాన్ని సంబంధిత మిల్లులకు తరలించినట్లు సీఈఓ తిరుపతిరెడ్డి తెలిపారు. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా లోడు చేయించి మిల్లులకు చేరవేసినట్లు తెలిపారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు ముగింపు దశకు చేరుతుందని అన్నారు. ఇంకా ఎవరైన రైతులు ఉంటే ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

మిర్యాలగూడ : ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌ను మంగళవారం పలు సంఘాల నాయకులు కలిసి పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ మాట్లాడుతూ తనకు పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ పుస్తకాలను పేద, మధ్య తరగతి విద్యార్థులకు త్వరలో అందజేస్తానని తెలిపారు.